క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ముప్పాళ్ల: ముప్పాళ్ల విద్యుత్ కేంద్రంలోని నూతన కేవీ బ్రేకర్, 11 కేవీ లైన్స్ మరమ్మతులలో భాగంగా ఈ నెల 13వ తేదీ మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ జి.సుచరిత సోమవారం తెలిపారు. మండలంలోని నార్నెపాడు, బొల్లవరం, దమ్మాలపాడు, రుద్రవరం గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

పెదకూరపాడు : యువతి అదృశ్యంపై పెదకూరపాడు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్సై గిరిబాబు తెలిపిన వివరాలు ప్రకారం పెదకూరపాడుకు చెందిన కంచర్ల చిన్నమ్మ, మార్క్ కుమార్తె పుష్పలత విజయవాడలోని ఒక కంపెనీలో ఉద్యోగం చేస్తుంది. పుష్పలత విధి నిర్వహణలో ఎక్కువగా ఫోన్ మాట్లాడుతుందని తండ్రి మార్క్‌కు తెలపగా ఉద్యోగం మాన్పించి పెదకూరపాడు తీసుకొచ్చారు. ఈ నెల 4న చర్చికి వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లి నేటి వరకు తిరిగి ఇంటికి రాకపోవడంతో బంధువులు, స్నేహితులను విచారించారు. ఎలాంటి ఆచూకీ లభించకపోవడంతో ఆదివారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాజుపాలెం రమేష్‌తో ఎక్కువగా ఫోన్ మాట్లాడుతున్నట్లు తన స్నేహితులు తెలిపారని మార్క్ ఫిర్యాదులో పేర్కొన్నాడు. రాజుపాలెం రమేష్ తమ కుమార్తెను తీసుకెళ్లి ఉంటాడని అనుమానం వ్యక్త పరిచారు. తండ్రి మార్క్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై గిరిబాబు తెలిపారు.

50 శాతం రాయితీపై పశువుల దాణా పంపిణీ

నకరికల్లు: తెల్ల రేషన్‌కార్డు కలిగిన పశు పోషకులకు 50 శాతం రాయితీపై పశువుల దాణా పంపిణీ చేయనున్నట్లు వెటర్నరీ ఏడీఏ వెంకటేశ్వర్లునాయక్ సోమవారం తెలిపారు. రెండు పెద్దపశువులకు, ఒక దూడకు 90 రోజులకు సరిపడా దాణా సరఫరా చేస్తామన్నారు. రూ.1,100 విలువ గల 450 కేజీల దాణా 50శాతం రాయితీపై రూ.555కు అందిస్తామన్నారు. మండలంలోని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'అన్నదాత సుఖీభవ'కు దరఖాస్తు చేసుకోవాలి

నకరికల్లు: మండలంలోని రైతులు అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో 16,168 మంది రైతులను గుర్తించామన్నారు. వారందరూ ఆయా గ్రామాల్లోని రైతు సేవ కేంద్రాల్లో సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టా కలిగిన రైతులకు కూడా రెండు పథకాలు వర్తిస్తాయని అన్నారు.

వైభవంగా పోలేరమ్మ తల్లి వార్షిక వేడుకలు



గోళ్ళపాడు(ముప్పాళ్ళ): మండలంలోని గోళ్ళపాడు గ్రామంలో పోలేరమ్మతల్లి వార్షిక వేడుకలు సోమవారం వైభవంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా తెల్లవారుజామున అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామస్తులు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కుందురువారిపాలెం గ్రామానికి చెందిన మహిళలు ప్రధాన రహదారిపై మజ్జిగ పంపిణీ చేశారు.

తొండపిలో అద్దంకమ్మ తల్లి తిరునాళ్ల

మండలంలోని తొండపి గ్రామంలో వేంచేసియున్న అద్దంకమ్మ తల్లి తిరునాళ్ల మహోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. భక్తులు అమ్మవారికి పొంగళ్లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామంలో ఇటీవల జరిగిన ఘర్షణ నేపథ్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ప్రతి కార్యకర్త కుటుంబానికి టీడీపీ అండ



సత్తెనపల్లి: టీడీపీ సభ్యత్వం కలిగిన ప్రతి కార్యకర్త కుటుంబానికి టీడీపీ అండగా ఉంటుందని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. ప్రమాదవశాత్తు మృతి చెందిన సత్తెనపల్లి మండలం రెంటపాళ్ళ గ్రామానికి చెందిన కొల్లి లక్ష్మయ్య, నకరికల్లుకు చెందిన సూర్తని ఏడుకొండలు కుటుంబాలకు రూ.5 లక్షల చెక్కులను సోమవారం పట్టణంలోని కార్యాలయంలో ఎమ్మెల్యే కన్నా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మృతులకు టీడీపీ సభ్యత్వం ఉండడంతో టీడీపీ ద్వారా మంజూరైన చెక్కులను మృతుల కుటుంబాలకు అందజేశామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మక్కపాటి రామచంద్రరావు ఉన్నారు.

సాగుకు ముందస్తు చర్యలే కీలకం

- పశువుల ఎరువుతో బహుళ ప్రయోజనాలు
- పశు వ్యర్థాలతో రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించవచ్చు
- దీని వాడకంతో భూమి సహజ స్వభావాన్ని కోల్పోదు



దిబ్బ ఎరువును పొలానికి తరలిస్తున్న రైతులు

నకరికల్లు: పంటలకు ముందస్తు చర్యలే కీలకం. ముఖ్యంగా వేసవిలో సాగుకు ముందు చేపట్టే చర్యలు పంట ఉత్పత్తి, దిగుబడిపై ప్రభావం చూపుతాయి. పంటకు పెట్టుబడి భారం తగ్గించడంతో పాటు నాణ్యమైన పంటను ఉత్పత్తి చేయడం సాగులో ప్రధాన అంశం. పరిమితిలేని ఎరువులు, పురుగుమందుల వినియోగం పంటపై దుష్ప్రభావం చూపడంతో పాటు అన్నదాతలకు నష్టాన్ని తెచ్చి పెడుతుంది. ఇలాంటి పరిస్థితిని అధిగమించేందుకు వేసవిలో రైతులు చేపట్టాల్సిన ప్రధాన చర్యలు ఖరీఫ్ సీజన్‌లో వేయబోయే పంటలకు రక్షణగా నిలుస్తాయి. పంట వేసే ముందుగా పశువుల ఎరువును పొలంపై చల్లి కుళ్లబెట్టి కలియదున్నడం ద్వారా భూమిలో పోషకాలు పెంచుకొని నాణ్యమైన పంటను ఉత్పత్తి చేయవచ్చని వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నారు.

● ప్రధానంగా మొక్కలకు నత్రజని, ఫాస్ఫరస్, పొటాష్ ఎరువులు తప్పనిసరిగా అవసరమవుతాయి. యూరియా, డీఏపీ, 19-19-19, పొటాష్, 14-35 తదితర రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించడంలో పశువుల వ్యర్థాల ఎరువు ఉపకరిస్తుంది. రసాయనిక ఎరువుల వినియోగం భూమిని కలుషితం చేసి నష్టాన్ని చేకూరుస్తుంది. ఫలితంగా మంచి దిగుబడి కలిగిన పంట రాకపోవడం, పైరు తెగుళ్లకు గురికావడం, రసం పీల్చే పురుగు, దోమలు వ్యాప్తి చెందడం వంటివి సంభవిస్తాయి. తెగుళ్ల నివారణకు పిచికారీ చేసిన రసాయనిక ఎరువులు, పురుగుమందుల ద్వారా భూమి సహజ స్వభావం కోల్పోయి పంటల దిగుబడిపై దుష్ప్రభావాలు చూపుతాయి.

సహజ ఎరువులే పంటకు మేలు

పాడి రైతులకు లభించే పశువుల పేడ ఎరువు భూమికి ఎంతగానో ఉపకరిస్తుంది. పశువుల పేడ ఎరువు భూమిలో వేయడం ద్వారా 20 శాతం వరకు రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించుకోవచ్చు. పేడ ఎరువులో నత్రజని, భాస్వరం, పొటాష్ అధికంగా భూమికి లభిస్తాయి. 100 కేజీల ఎరువుకు 0.5 శాతం నత్రజని, 1 శాతం భాస్వరం, 0.5 శాతం పొటాష్ లభిస్తాయి. వరి పైరుకు 2-3 ట్రక్కులు, మిర్చి 4-5 ట్రక్కుల ఎరువును వేసవిలో పొలాల్లో చల్లుకొని భూమిలో కలియదున్నాలి. తద్వారా భూమిలో సేంద్రియ పదార్థం సహజత్వంగా పెరుగుతుంది. నీటిని నిల్వచేసుకునే సామర్థ్యం పంటకు లభిస్తుంది. సూక్ష్మజీవుల సంతతి అలాగే సూక్ష్మ, స్థూల పోషకాల లభ్యత పెరగడం ద్వారా పైరు ఆరోగ్యంగా ఉంటుంది. చీడపీడలు ఆశించినా వాటిని తట్టుకొనే సామర్థ్యం మొక్కకు చేకూరుతుంది. ప్రధానంగా రసాయనిక ఎరువులకు పెట్టే ఖర్చు తగ్గడమే కాక భూమిలో సహజత్వం కోల్పోకుండా పంటకు బలాన్ని చేకూరుస్తుంది.



పశువుల పేడ ఎరువును పొలానికి తరలించేందుకు ట్రాక్టర్‌లో పోస్తున్న రైతులు

వినియోగం పెంచాలి



పంటలు సాగుకు సమాయత్తమయ్యే రైతులకు వేసవి కీలకమైన సమయం. భూమిలో పోషకాలు పెంచేందుకు చేసిన ప్రయత్నాలు ఆరోగ్యమైన పంటను అందిస్తాయి. ప్రధానంగా దిబ్బ ఎరువును భూమిలో కలియదున్నడం ద్వారా, జీలుగ, జనుము లాంటి పచ్చిరొట్ట ఎరువుల ద్వారా సూక్ష్మపోషకాల లభ్యత పెంచుకోవచ్చు. ఏటా వేసవిలో పశువుల వ్యర్థాల ఎరువులు వేయడం ద్వారా రసాయనిక ఎరువుల మోతాదు తగ్గించుకొని వ్యవసాయం లాభసాటిగా మలచుకోవచ్చు.

– కె.దేవదాసు, మండల వ్యవసాయాధికారి, నకరికల్లు

పాలకుల తీరు ప్రజాస్వామ్యానికి మాయని మచ్చ

- బీసీ మహిళలపై దాడులు హేయమైన చర్య
- వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర మాజీ కార్యదర్శి రాజవరపు నాగేశ్వరరావు



మాట్లాడుతున్న రాజవరపు శివనాగేశ్వరరావు

సత్తెనపల్లి: పాలకులు ప్రతిపక్షం పట్ల వ్యవహరిస్తున్న తీరు ప్రజాస్వామ్యానికే మాయని మచ్చగా ఉందని వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర మాజీ కార్యదర్శి, సీనియర్ న్యాయవాది రాజవరపు శివనాగేశ్వరరావు అన్నారు. సత్తెనపల్లిలోని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేస్తూ అరాచకం సృష్టిస్తున్నారన్నారు. చిలకలూరిపేటలో మాజీ మంత్రి, బీసీ సామాజిక వర్గానికి చెందిన మహిళ అయిన విడుదల రజినిపై చిలకలూరిపేట రూరల్ సీఐ సుబ్బానాయుడు, పోలీస్ సిబ్బంది వ్యవహరించిన తీరు అత్యంత దారుణమన్నారు. మాజీ మంత్రి, మహిళ అనే గౌరవం కూడా లేకుండా పోలీసులు దురుసుగా వ్యవహరించారన్నారు. ఎన్నికల సమయంలో బీసీలకు ప్రాధాన్యం ఇస్తామంటూ నమ్మబలికి అధికారంలోకి వచ్చాక బీసీలపై దాడులకు తెగ బడుతున్నారన్నారు. ఎన్నికల సమయంలో అధికారం కోసం సూపర్ సిక్స్ పేరుతో అలవికాని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేయడమే కాకుండా ప్రశ్నించే వారిపై పోలీసులను ప్రయోగిస్తూ అక్రమ కేసులు బనాయిస్తున్నారన్నారు. కేవలం డైవర్షన్ పాలిటిక్స్ నడుపుతూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేయడం కూటమి నేతలకు పరిపాటిగా మారిందన్నారు. ఎన్ని అక్రమ కేసులు పెట్టినా వైఎస్సార్‌సీపీ అన్నింటికీ సిద్ధంగా ఉందని, కూటమి దురాగతాలపై ప్రజల పక్షాన పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. మద్యం విక్రయాలు ప్రభుత్వమే జరిపితే కుంభకోణం ఎక్కడ ఉంటుందని ప్రశ్నించారు. కూటమి నేతల కక్షసాధింపు చర్యల తీరును ప్రజలు గమనిస్తున్నారని, సరైన సమయంలో సరైన రీతిలో బుద్ధి చెబుతారన్నారు. బీసీ మహిళలపై జరుగుతున్న అన్యాయాలను, అక్రమాలను కూటమి ప్రభుత్వం ఆపకపోతే తామే ప్రజా ఉద్యమాన్ని నడుపుతామని హెచ్చరించారు. సమావేశంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు షేక్ మౌలాలి, 1వ వార్డు కౌన్సిలర్ వరికల్లు కోటేశ్వరరావు, బీసీ సెల్ పట్టణ అధ్యక్షుడు సంకుల తిరుమలరావు, పట్టణ మాజీ అధ్యక్షుడు తుమ్మల వెంకటేశ్వరరావు, నాయకులు లోకా మాధవ, గడ్డం వెంకటేశ్వర్లు (బుల్లోడు), గంట ఏసుబాబు, ఆర్.సాంబయ్య ఉన్నారు.

క్రీస్తు మార్గం అనుసరణీయం



సత్తెనపల్లి: ప్రతి ఒక్కరూ శాంతి, సమాధానం, ప్రేమ కలిగి ఉండాలని బోధించిన క్రీస్తు మార్గం అనుసరణీయమని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గంధం రవీందర్ అన్నారు. సత్తెనపల్లిలోని బాగ్స్ మెమోరియల్ సెంటినరి బాప్టిస్ట్ చర్చ్ సండే స్కూల్ విద్యార్థులకు వారం రోజులు నిర్వహించిన విరామకాల బైబిల్ పాఠశాల(వీబీఎస్) తరగతులు ముగిశాయి. తరగతుల్లో నిర్వహించిన కంఠత వాక్యాలు, పాటలు, కథల పోటీల్లో ప్రతిభా వంతులకు బహుమతుల ప్రదానోత్సవం ఆదివారం రాత్రి జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయి ప్రతిభావంతులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. సంఘ కాపరి రెవ.జె.ఇశ్రాయేలు వాక్య పరిచర్య చేశారు. గంధం రవీందర్‌ను సంఘ పెద్దలు శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో వీబీఎస్ ప్రతినిధులు గుజ్జర్లపూడి శ్రీదేవి, అహల్య, సంఘ అధ్యక్షుడు షైక్ లాల్, ఉపాధ్యక్షుడు చంద్రకాంత్, కార్యదర్శి ఆనిరాజ్, సంయుక్త కార్యదర్శి కిషోర్ బాబు, కోశాధికారి రవిరాజు, స్త్రీలు, చిన్నారులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం



సత్తెనపల్లి: జీవిత చరమాంకంలో వృద్ధాప్యం సహజమని, వృద్ధులను దైవంతో సమానంగా భావించాలని వ్యాపారవేత్త పుసులూరి చిన్నికృష్ణ అన్నారు. పట్టణ గుంటూరు రోడ్‌లోని ఆదరణ అనాథ వృద్ధాశ్రమం, నాగార్జున నగర్ నందిగామ డొంక రోడ్డులోని సాధన అనాథ వృద్ధుల ఆశ్రమంలో సోమవారం తన పెద్ద కుమారుడు పుసులూరి తరుణ్ తేజ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని అన్నసంతర్పణ నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్ని కృష్ణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వృద్ధులకు చేతనైన సాయం అందిస్తూ వారి గౌరవ మర్యాదలకు భంగం కలగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఆయన కుటుంబ సభ్యులు, రెండు ఆశ్రమాల నిర్వాహకులు తదితరులు ఉన్నారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న గుంటూరు విజయ్ కుమార్

సత్తెనపల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు ఈ నెల 20న కేంద్ర కార్మిక సంఘాలు చేపట్టిన దేశవ్యాప్త సమ్మెలో కార్మికులు, కర్షకులు, అసంఘటిత రంగ కార్మికులు, ఉద్యోగ, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా నాయకులు గుంటూరు విజయకుమార్ పిలుపునిచ్చారు. పట్టణంలోని పుతుంబాక భవన్‌లో సోమవారం జరిగిన ప్రజా సంఘాల రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశానికి రైతు సంఘం నాయకులు గుంటుపల్లి బాలకృష్ణ అధ్యక్షత వహించారు. విజయ్ కుమార్ మాట్లాడుతూ ఉపాధి అవకాశాలు తగ్గిపోయి అరకొర వేతనాలతో జీవనం సాగిస్తున్న కార్మిక, అసంఘటిత రంగ కార్మికులు అధిక ధరలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పంటలకు గిట్టుబాటు ధర లేక, అధిక పెట్టుబడులు, ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వాలు ముందుకు రాకపోవడంతో రైతులు ఆత్మహత్యల పాలవుతున్నారన్నారు. రైతు సంఘం మాజీ రాష్ట్ర కమిటీ సభ్యులు గద్దె చలమయ్య మాట్లాడుతూ పంటలకు గిట్టుబాటు ధర కల్పించే విధంగా చట్టం చేయాలని అన్నారు. బ్రిటీష్ కాలంలో కార్మికులు ప్రాణ త్యాగాలు చేసి సాధించుకున్న చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దుచేసి కార్పొరేట్లకు మేలు చేసే లేబర్ కోడ్‌లను తీసుకువచ్చిందని, అవి అమలయితే కార్మికులు మరింత దుర్భరమైన స్థితిలోకి నెట్టబడతారన్నారు. ఆ లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, రద్దు చేసిన కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని కేంద్ర కార్మిక సంఘాలు 20న చేపట్టిన సమ్మెలో కార్మికులు, కూలీలు, రైతులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, అసంఘటిత రంగ కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సీఐటీయూ పట్టణ కార్యదర్శి ఎం.హరిపోతురాజు, డీవైఎఫ్ఐ నాయకులు జడ రాజకుమార్, రైతు సంఘం నాయకులు పిచ్చిరెడ్డి, మక్కపాటి నరసింహారావు, కౌలు రైతు సంఘం నాయకులు పెండ్యాల మహేష్, గారా జాలయ్య, కంచర్ల నాగేశ్వరరావు, పెయింటింగ్ వర్కర్స్ నాయకులు పెదాల శ్రీనివాసరావు, చేనేత కార్మిక సంఘం నాయకులు పి.ప్రభాకర్, జి.సుసులోవ్ పాల్గొన్నారు.

న్యాయవాది అలీఖాన్ మృతి బార్ అసోసియేషన్‌కు తీరనిలోటు



సత్తెనపల్లి: న్యాయవాది అక్బర్ అలీఖాన్ మృతి బార్ అసోసియేషన్‌కు తీరనిలోటని సత్తెనపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గంగూరి అజయ్‌కుమార్ అన్నారు. న్యాయవాది అక్బర్ మృతి చెందటంతో సత్తెనపల్లి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం పట్టణ బార్ అసోసియేషన్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అజయ్‌కుమార్ మాట్లాడుతూ అచ్చంపేట మండలం చెరుకుంపాలెంలో స్థిరపడిన అక్బర్ అలీఖాన్ గుండెపోటుతో అకాల మృతి చెందాడన్నారు. ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాది అంకాళ్ళ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అక్బర్ అలీఖాన్ తెలంగాణ రాష్ట్రంలో వరంగల్ నుంచి అచ్చంపేట మండలం చెరుకుంపాలెం గ్రామంలో స్థిరపడిన మంచి మానవతా దృక్పథం కలిగిన వ్యక్తి అని కొనియాడారు. ఆయనతో 30 ఏళ్ల నుంచి ఉన్న అనుబంధాన్ని బార్ అసోసియేషన్ సభ్యులకు తెలియజేశారు. సోమవారం న్యాయవాదులు నాలుగు న్యాయస్థానాల్లో విధులను బహిష్కరించి బార్ అసోసియేషన్ హాల్లో అలీఖాన్ ఆత్మకు కలగాలని మౌనం పాటించారు. కార్యక్రమంలో న్యాయవాదులు నరిశేటి వేణుగోపాల్, కళ్ళం వీరభాస్కరరెడ్డి, అనుమోలు జయరామ్, జూపల్లి శేషయ్య, దివ్వెల శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

ప్రజా ప్రతినిధులకు సమాచారం ఇవ్వరా..?!

4వ వార్డ్ కౌన్సిలర్ కటకం రామకృష్ణ



సత్తెనపల్లి: పట్టణంలో జరిగే అభివృద్ధి పనుల శంకుస్థాపనలకు ప్రజలచే ఎన్నికైన కౌన్సిలర్లకు కనీస సమాచారం ఇవ్వరా అని టీడీపీ పట్టణ అధ్యక్షుడు, 4వ వార్డ్ కౌన్సిలర్ కటకం రామకృష్ణ సోమవారం అన్నారు. ఈ నెల 10న పట్టణంలో రూ.1.30 కోట్ల అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ శంకుస్థాపనలు చేశారని, ఇది శుభ పరిణామం అన్నారు. 7వ వార్డులో రైల్వేస్టేషన్ రోడ్‌లోని ప్రభుత్వ ఏరియా వైద్యశాల వద్ద నుంచి మీసేవ కేంద్రం వరకు రూ.29 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారన్నారు. అయితే ఈ రోడ్డు 4, 5, 7 వార్డులకు సంబంధించిందన్నారు. మున్సిపల్ అధికారులు కేవలం 7వ వార్డు కౌన్సిలర్ రంగిశెట్టి సుమన్ కుమార్‌ను ఆహ్వానించి 4, 5 వార్డుల కౌన్సిలర్లకు కనీస సమాచారం కూడా ఇవ్వలేదన్నారు. 4, 5 వార్డుల్లోనే ఈ రహదారి విస్తీర్ణం ఎక్కువగా ఉందన్న విషయాన్ని గ్రహించాలన్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులకు కనీస సమాచారాన్ని ఇచ్చి గౌరవించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు.

కనుల పండువగా శ్రీలక్ష్మీనరసింహస్వామి తిరునాళ్ల



శ్రీలక్ష్మీనరసింహ స్వామి



విద్యుద్దీపాల అలంకరణలో శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం

నకరికల్లు: స్థానిక కొండపై గల ఆదిలక్ష్మీ చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి తిరునాళ్ల మహోత్సవం సోమవారం కనుల పండువగా నిర్వహించారు. తిరునాళ్ల పురస్కరించుకొని ఆలయాన్ని రంగురంగుల విద్యుద్దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. మహిమాన్విత చరిత్ర కలిగిన స్వామి వారి తిరునాళ్ల మహోత్సవాన్ని ఆలయ అర్చకులు కొడవటికంటి మధుసూధనాచార్యులు ఆధ్వర్యంలో విశేషంగా నిర్వహించారు. తిరునాళ్ల పురస్కరించుకొని స్వామి వారికి విశేష ద్రవ్యములతో అభిషేకాలు చేశారు. పంచామృతస్నపన గావించి ప్రత్యేకంగా అలంకరించారు. స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. అదే కొండపై గల త్రిపురాంతకేశ్వరస్వామి వారిని కూడా దర్శించుకుని భక్తులు మొక్కులు చెల్లించారు. భక్తుల సహకారంతో ఆలయకొండ కింది భాగంలో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వేలాదిమంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. భక్త సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఎంతగానో అలరించాయి.

బాలుర ఆశ్రమాన్ని పరిశీలించిన జిల్లా అధికారులు



విద్యార్థిని వివరాలు అడిగి తెలుసుకుంటున్న జిల్లా అధికారులు

రాజుపాలెం: మండలంలోని కోటనెమలిపురి పంచాయతీ పరిధిలోని వీరమ్మ కాలనీలో దీనమ్మ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చైల్డ్ కేర్ బాలుర ఆశ్రమాన్ని పల్నాడు జిల్లా ప్రొబేషనరీ అధికారి, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి చౌరాజులు, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ కృష్ణారెడ్డి, సీడీపీవో శ్రీలత, ఏసీడీపీవో శాంతకుమారి, చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ ప్రశాంతి, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ ప్రశాంత్‌కుమార్‌లు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థుల రికార్డులను, ఆహారాన్ని పరిశీలించారు. గతంలో లైసెన్సు ఉందని, కాలం ముగియడంతో రెన్యువల్ కోసం చైల్డ్ కేర్‌ను పరిశీలించడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా అనాథాశ్రమాలను నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. వారి వెంట ఆశ్రమ నిర్వాహకులు గరికపాటి శంకరరావు తదితరులు ఉన్నారు.

విస్తృతంగా విద్యుత్ విజిలెన్స్ తనిఖీలు



విలేకరుల సమావేశంలో విద్యుత్ విజిలెన్స్ అధికారులు

క్రోసూరు: విద్యుత్ శాఖ విజిలెన్స్ విభాగం, ఆపరేషన్స్ విభాగం పల్నాడు జిల్లా పర్యవేక్షణ ఇంజనీర్ పి.విజయకుమార్ ఆధ్వర్యంలో క్రోసూరు, అందుకూరు, కొత్తూరు, పీసపాడు, గుడిపాడు, గరికపాడు, విప్పర్ల, నాగవరం, బయ్యవరం గ్రామాల్లో విస్తృత తనిఖీలు నిర్వహించి అక్రమ విద్యుత్ వినియోగిస్తున్న వారిపై రూ.2.53 లక్షల అపరాధ రుసుము విధించినట్లు క్రోసూరు ఏఈ బసవరాజు తెలిపారు. ఈ మేరకు స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు తెలియజేశారు. మీటరు లేకుండా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 12 మందికి రూ.0.24 లక్షలు, మీటరున్నప్పటికీ విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న నలుగురికి రూ.0.22 లక్షలు, అనుమతించిన కేటగిరీలు కాక ఇతర కేటగిరీలలో విద్యుత్ వినియోగిస్తున్న ఐదుగురికి రూ.0.13 లక్షలు, అనుమతించిన లోడు కంటే అదనంగా వాడుతున్న 84 మందికి రూ.1.94 లక్షలు మొత్తం రూ.2.53 లక్షలు అపరాధ రుసుము విధించినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో 39 మంది అధికారులు, 114 మంది సిబ్బంది 2,478 సర్వీసులు తనిఖీ చేసినట్లు చెప్పారు. ఈ తనిఖీల్లో ఈఈ సీహెచ్ వెంకటేశ్వరరావు, సీహెచ్ రాంబొట్ల, డీఈఈ కె.రవికుమార్, ఎస్.మల్లికార్జున, రాజశేఖరబాబు, కోటేశ్వరరావు, ఎం.సతీష్‌కుమార్, యు.శివశంకర్, డీఈఈ, ఏఈఈలు పాల్గొన్నారు.

గోవధ చేయకుండా కాపాడాలని వినతి



పంచాయతీ కార్యాలయంలో వినతి పత్రం అందజేస్తున్న వీహెచ్‌పీ ప్రతినిధులు

అచ్చంపేట(క్రోసూరు): బక్రీద్ పండుగ పురస్కరించుకుని అక్రమంగా గో సంపద తరలించటం, రైతులకు ఉపయోగపడే గోవులను వధించటం జరగకుండా ఆయా గ్రామాల్లో పంచాయతీలు చర్యలు చేపట్టాలని సోమవారం విశ్వహిందూ పరిషత్ గోరక్షా విభాగం సభ్యులు అచ్చంపేట పంచాయతీ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్రమ జంతు రవాణా, వధ చేసే వారిపై చట్టపరమైర చర్యలు తీసుకుంటామని హెచ్చరించాలంటూ మైకుల ద్వారా, దేవాలయం, చర్చిలు, మసీదుల ద్వారా ప్రచారం చేయాలన్నారు. బక్రీద్ పురస్కరించుకుని జూన్ 7వ తేదీ వరకు గ్రామాల్లో ఎద్దులు, కోడెలు, గేదెలు, ఆవుల అమ్మకాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గో సంపద అక్రమ రవణా, వధ చేయకుండా ముందుస్తుగా కౌన్సెలింగ్ నిర్వహించాలన్నారు. దూరప్రాంతాల నుంచి ఆవుల మంద తరలించి మేతకు వచ్చే వారు తమ మందలను అమ్మకుండా పోలీసుస్టేషన్‌లో బైండోవర్ చేయించాలన్నారు. గ్రామంలో కొత్తగా ఆవులు, గేదెలు, ఎద్దులు కనబడితే (రైతులవి కానివి) వాటిని బందుల దొడ్డికి తరలించి, పశు పోషకులకు అప్పగించాలన్నారు. గో సంపదను కాపాడాలని కోరారు. వినతి అందచేసిన వారిలో వీహెచ్‌పీ ప్రతినిధులు మన్నవ చలపతిరావు, తమ్మా మర్రిరెడ్డి, బాగవత్ రవికుమార్, ఏలూరి బాలస్వామి, తిరుపతిస్వామి, తడివండ్ల లక్షాచారి తదితరులున్నారు.

రైతాంగ సాయుధ పోరాట యోధుడు ఓంకార్

ఎంసీపీఐయూ జిల్లా కార్యదర్శి రెడ్ బాషా



ఓంకార్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంసీపీఐయూ నాయకులు, గిరిజనులు

నకరికల్లు: నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా రైతాంగ సాయుధ పోరాటం నడిపిన కామ్రేడ్ ఓంకార్ పోరాటపటిమ స్ఫూర్తిదాయకమని ఎంసీపీఐయూ జిల్లా కార్యదర్శి రెడ్ బాషా అన్నారు. మండలంలోని శివాపురం తండా గ్రామంలో కామ్రేడ్ మద్దికాయల ఓంకార్ శతజయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఓంకార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్మారక స్థూపాన్ని నిర్మించేందుకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నైజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా రైతులతో కలసి అలుపెరగని పోరాటం చేసిన యోధుడు అని కొనియాడారు. వరంగల్ జిల్లా నర్సంపేట నియోజకవర్గం నుంచి ఐదుసార్లు శాసనసభ్యునిగా ఎన్నికై అణగారిన వర్గాల కోసం పోరాడిన మహనీయుడన్నారు. తండాల్లో గిరిజనులకు మనుగడ కల్పించడంలో ఓంకార్ పోరాటం ఉందన్నారు. కార్యక్రమంలో ఎంసీపీఐయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు తూమాటి మణికంఠేశ్వరరావు, పల్నాడు జిల్లా ఏఐఎఫ్‌డీవై కార్యదర్శి మహబూబ్‌బాషా, తూమాటి శివయ్య, బాలూనాయక్, నానికేనాయక్, మునినాయక్, లక్ష్మానాయక్, హనుమునాయక్ తదితరులు పాల్గొన్నారు.